చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ లీడర్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కనిపించని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సురేఖ ఫొటో

పీఎస్ఆర్ వర్సెస్ వివేక్

చెన్నూర్ పర్యటనకు డిప్యూటీ సీఎం రాకుండా పీఎస్ఆర్ అడ్డుకున్నారా?

- జిల్లా అధ్యక్షురాలి ఫొటో లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు
- చెన్నూర్‌లో ప్రేమ్‌సాగర్‌రావు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుపై వివేక్ ఆగ్రహం
- రామగుండం నుంచి అలిగి చెన్నూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ
- మంచిర్యాల జిల్లా కాంగ్రెస్‌లో తారాస్థాయికి చేరిన వర్గపోరు

మంచిర్యాల, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి కోసం మొదలైన విభేదాలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన సాక్షిగా బయటపడ్డాయి. పెద్దపల్లి జిల్లాతోపాటు మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు పర్యటించాల్సి ఉంది. కాగా.. రామగుండంలో మంత్రుల పర్యటన ఆలస్యమైంది. దీంతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆయన కుమారుడు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రుల పర్యటన సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు భారీ ప్లెక్సీలు ఏర్పాటు చేయడంపై మంత్రుల సమక్షంలోనే వివేక్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు రామగుండం సింగరేణి గెస్ట్‌హౌస్ నుంచి ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ అలిగి చెన్నూర్‌కు బయల్దేరి వచ్చారు. దీంతో డిప్యూటీ సీఎం చెన్నూర్ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకున్నారు. రామగుండంలో ఆలస్యం కావడం, భారీ వర్షాలతో ఖమ్మం వెళ్లాల్సి రావడంతో భట్టి పర్యటన రద్దు చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నా.. ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ అలిగి వచ్చాక కూడా డిప్యూటీ సీఎం, మంత్రులు రామగుండం పర్యటనను కొనసాగించడం అనుమానాలకు తావిస్తున్నది.

గెలిచిన నాటి నుంచే గొడవలు..

వివేక్ సఫరేట్ మీటింగ్..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచే ఎమ్మెల్యేల మధ్య దూరం పెరుగుతూ వస్తున్నది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తే క్రెడిట్ మొత్తం చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కొట్టేయడంపై ఎమ్మెల్యే పీఎస్ఆర్ ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. అక్కడ మొదలైన పంచాయతీ పెరుగుతూ వస్తున్నది. మంత్రి పదవి విషయంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరికి వారు సెఫరేట్‌గా ప్రయత్నాలు చేయడంతో ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి నెలకున్నది. ఈ నేపథ్యంలో వచ్చిన ఎంపీ ఎన్నికల్లో తానేంటో అధిష్ఠానానికి చూపించుకోవాలనే ఉద్దేశంతో పీఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం కష్టపడ్డారు తప్పితే, వ్యక్తిగతంగా ఆయనకు ఇష్టం లేదనే చర్చ అప్పట్లో నడిచింది. ఇటీవల మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న సమయంలోనూ ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు వినిపించాయి. ఎవరికి వారు పదవి కోసం పట్టుపడుతున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఒక రకంగా డిప్యూటీ సీఎం భట్టి చెన్నూర్ పర్యటన రద్దు చేసుకోడానికి కూడా పీఎస్ఆర్ కారణమనే చర్చ నడుస్తున్నది. రామగుండం నుంచి అలిగి వచ్చిన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని చెన్నూర్ పర్యటనకు తీసుకొస్తానని, రాజకీయంగా ఇక నుంచి మరింత గట్టిగా ముందుకెళ్తామని వివేక్ సహచరులతో చెప్పుకొచ్చారు.

ఫ్లెక్సీల పంచాయతీ..

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల పర్యటన సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై వివేక్ తీవ్రంగా మంత్రుల ముందే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్కడ మొదలైన పంచాయతీ డిప్యూటీ సీఎం పర్యటన రద్దు అయ్యే దాకా వచ్చింది. కాగా.. చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే పీఎస్ఆర్ సతీమణి కొక్కిరాల సురేఖ ఫొటోలు పెట్టలేదు. ఇది కావాలనే ఉద్దేశపూర్వకంగా చేసిందేంటూ పీఎస్ఆర్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. రామగుండం నుంచి వివేక్ అలిగి వెళ్లివచ్చాక కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రేమ్‌సాగర్‌రావు నాయకత్వంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి నమ్మకం ఉందన్నారు. పీఎస్ఆర్ అభిమానుల మనోభావాలను అధిష్ఠానం గుర్తించిందని పరోక్షంగా పీఎస్ఆరే పదవి వస్తుందనే సంకేతాలు ఇచ్చారు. దీంతో పీఎస్ఆర్ వర్గం నాయకులు సంబురపడుతున్నారు. ఈ పరిణామాలపై ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబం ఎలా స్పందిస్తుంది. జిల్లా కాంగ్రెస్ పార్టీలో పీఎస్ఆర్‌కు పోటీగా మరో వర్గాన్ని తయారు చేస్తారా? అనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

పర్యటన రద్దుతో జనం అవస్థలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెన్నూర్‌లో సోలార్ పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి వస్తున్నారని తెలిసి కాంగ్రెస్ కార్యకర్తలు, జనాలు వచ్చారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రోగ్రాం అని తెలిసి వచ్చిన జనాలు సాయంత్రం 5 గంటల వరకు ఎదురుచూశారు. చివరకు డిప్యూటీ సీఎం రావడం లేదని తెలిసి ఆగ్రహంతో వెను తిరిగారు. వచ్చిన కొద్ది పాటి జనాలకు కనీసం భోజనాలు పెట్టకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నుంచి ప్రారంభోత్సవ వేదికకు అరకిలోమీటర్ దూరం నడుచుకుంటే వస్తే చివరకు రారని చెప్తారా.. ఇదేం పద్ధతి అంటూ తిట్టుకుంటూ వెళ్లిపోవడం కనిపించింది. చెన్నూర్‌లో పర్యటన రద్దయినా జైపూర్ ఎస్టీపీపీ లోనైనా ఉంటుంది అనుకుంటే చాలా సేపు ఎదురుచూశాక అక్కడ కూడా ప్రోగ్రాం ఉండదంటూ చెప్పారు. దీంతో చాలా సేపు ఎదురుచూసిన జిల్లా అధికారులు, మీడియా, కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోయారు.

చెన్నూర్‌కు డిప్యూటీ సీఎం రావడం లేదని తెలిసి తిరిగి వెళ్లిపోతున్న జనం

మున్సిపాలిటీ నిధులకు కొర్రీ

- రూ.41.30 కోట్లు నిలిపివేత
- రూ.5.40 కోట్ల పనులకు ఆమోదం
- పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు ఆటంకం

ఆదిలాబాద్, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగింది. ఉమ్మడి రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న ఆదిలాబాద్ మున్సిపాలిటీని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ప్రగతి పథంలోకి పయనింప చేసింది. రూ.300 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేసింది. ఎస్‌డీఎఫ్, సీఎం అస్యూరెన్స్, టీయూఎఫ్ఐడీసీ, ఆర్‌అండ్‌బీ నిధులతో ఆదిలాబాద్ పట్టణాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో రోడ్లు, మురికికాల్వల నిర్మాణం, తాగునీటి సౌకర్యంలో భాగంగా మిషన్ భగరీథ పథకంలో భాగంగా ఇంటింటికీ నల్లానీటి సౌకర్యం కల్పించారు. వార్డుల్లో పార్కుల ఏర్పాటు, హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టారు. పట్టణంలోని రూ.50 కోట్లతో అన్ని చౌరస్తాలను అభివృద్ధి చేయడంతో కనువిందు చేస్తున్నాయి.

రూ.41.30 కోట్ల నిధుల నిలిపివేత

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల అభివృద్ధి కోసం గతేడాది రూ.46.70 కోట్లను మంజూరు చేసింది. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) నుంచి ఈ నిధులను రుణంగా ఇస్తున్నట్లు గతేడాది సెప్టెంబరు 22న జీవో ఆర్టీ నం.719 ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో కాలనీల్లో మురికికాలువలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కల్వర్టులు, వంతెనల నిర్మాణాలకు సంబంధించిన 49 పనులు చేయాల్సి ఉండగా, అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభంకాలేదు. ఎన్నికల తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను నిలిపివేసింది. కౌన్సిలర్లు ఆందోళన నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వం కలెక్టర్ అధ్యక్షతన, ఎమ్మెల్యే, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సవరించి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సవరించి ప్రభుత్వానికి పంపగా వీటిలో కేవలం రూ.5.40 కోట్లకు సంబంధించిన పనులను మాత్రమే ప్రభుత్వం ఆమోదించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో పలు కాలనీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోగా, వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిత్రంలో కనిపిస్తున్నది ఆరో వార్డులోని కుంట నీరు. యేటా వానకాలంలో వర్షాలతో కుంటలోని నీరు సమీప గృహాల మధ్య నుంచి ప్రవహిస్తుంది. ఇక్కడ కల్వర్టు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మున్సిపాలిటీకి అన్యాయం జరిగింది..

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో తీవ్ర అన్యాయం జరిగింది. కేఈఆర్‌కే కాలనీ, బంగారుగూడ, 170 కాలనీ, న్యూ హౌసింగ్ బోర్డు బల్దియాలో వీలినమైన 13 వార్డుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పలు వార్డుల ప్రజలు రోడ్లు, మురికికాలువలు, కల్వర్టులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వానకాలంలో వర్షం నీరు ఇండ్లలోకి ప్రవహిస్తుంది. ప్రభుత్వ సూచనల మేరకు సవరించిన ప్రతిపాదనలు ఆమోదించకపోవడం విచారకరం. **- జోగు ప్రేమేందర్, చైర్మన్, ఆదిలాబాద్ మున్సిపాలిటీ.**

కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్టులో పెట్టాలని చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ కౌన్సిలర్లు

తాంసి బస్టాండ్ వద్ద సులభ్ కాంప్లెక్స్‌ని కూలగొట్టి అక్రమ నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

మున్సిపల్ సమావేశం రసాభాస

- చర్యలు తీసుకోవాలని ప్ల కార్డులు, ప్లెక్సీలతో కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన
- గ్రావెల్ టెండర్ ఇచ్చినా స్పందించని కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి

ఎదులాపురం, ఆగస్టు 31 : ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. శనివారం కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ ప్రేమేందర్ అధ్యక్షతన 13 అంశాలపై కౌన్సి ల్ సమావేశం ప్రారంభమైంది. తొలుత కాంగ్రెస్ కౌన్సిలర్లు తాంసి బస్టాండ్ వద్ద సులభ్ కాంప్లెక్ కూల్చి వేసి భవనం నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్ల కా ర్డులు, ప్లెక్సీలు ప్రదర్శించారు. అదే సమయంలో వినాయక చవితి సమిపిస్తున్నా గుంతలను పూడ్చడానికి గ్రావెల్ టెండర్ ఇచ్చిన స్పందించని కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని బీజేపీ కౌన్సిలర్లు చైర్మన్‌కు వినతి పత్రం అందించారు. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లను శాంతింపజేసి అజెండా అనంతరం జీరో అవర్స్‌లో మాట్లాడతామని చైర్మన్ చెప్పారు. అయినా వినకుండా పట్టుబట్టారు. రూ.కోట్ల విలువ గల మున్సిపల్ భూములు కబ్జాకు గురవుతున్నాయని, సదరు కబ్జాదారుడు దర్జగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోరా అని కాంగ్రెస్ కౌన్సిలర్లు మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. అనంతరం 13 అంశాలతో ప్రవేశపెట్టిన అజెండాను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్ మాట్లాడుతూ.. వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ తరపున ఏర్పాట్లకు రూ.16 లక్షలను కేటాయించామన్నారు. బతుకమ్మ ఘాట్ల మరమ్మతులు కూడా చేపడతామన్నారు. అదేవిధంగా వీధి దీపాల కోసం రూ.5 లక్షలను అజెండాలో పెట్టామన్నారు. భుక్తాపూర్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కబ్జాలు జరిగాయని, వారికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మ ద్ ఖాన్, డీఈలు తిరుపతి, కార్తీక్, శానిటరీ ఇన్స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్, దర్బార్ నిర్వహణ

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 31 : జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ముఖ్య కార్యాలయంలో శనివారం ఎస్పీ జానకి షర్మిల పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పరేడ్ నిర్వహించడం వల్ల సిబ్బందికి విధుల్లో క్రమశిక్షణ అలవర్చుకుంటారన్నారు. శారీరక ధృడత్వం పెరుగుతుందన్నారు. అనంతరం దర్బార్ కార్యక్రమం నిర్వహించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

గణేశ్ మండపాల నిర్వాహకులు నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిర్వాహకులు తాము ఏర్పాటు చేసే గణేశ్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెబ్‌సైట్ http://policeportal. tspolice.gov.in ద్వారా మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలను నమోదు చేసుకొవాలి. అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.

దర్బారులో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల

విద్యార్థిని ఆత్మహత్య

- మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు
- కళాశాలలో చేరిన నాలుగు రోజులకే ఘటన
- బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

ఉట్నూర్ రూరల్/రుద్రూర్, ఆగస్టు 31 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌కు చెందిన లింగావత్ విష్ణు-వని తలకు నలుగురు సంతానం. ఇందులో రెండో సంతానం రక్షిత. రక్షిత నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. నాలుగు రోజుల క్రితమే కళాశాల వసతి గృహంలో చేరింది. శనివారం వసతి గృహంలోని బాత్‌రూంలో ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై సాయన్న ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు అత్యుత్సాహంతో రక్షిత తల్లిదండ్రులు రాక ముందే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలుపాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా అడ్డుకున్నారు. దీంతో వసతిగృహం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకున్నది. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, ఒకవేళ కారకులు ఎవరైనా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ శ్రీనివాస్ విద్యార్థి సంఘాల నాయకులను సముదాయించారు. హాస్టల్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా విద్యార్థిని ఆత్మహత్య ఘటనకు సంబంధించిన ముందు దృశ్యాలు రికార్డు కాకపోవడంపై రక్షిత బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్నికల్ సమస్యతో రికార్డు కాకపోయి ఉండొచ్చని ప్రిన్సిపాల్ బాలాజీనాయక్ తెలుపగా.. టెక్నీషియన్‌ను పిలిపించాలని డిమాండ్ చేశారు. పోలీసులు విచారణ చేపడతామని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. రక్షిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ జయేశ్‌రెడ్డి, రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు.

రక్షిత(ఫైల్), మృతదేహాన్ని తరలించకుండా అడ్డుకుంటున్న విద్యార్థి సంఘాల నాయకులు

అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కంట్రోల్ రూమ్ నంబర్ 18004251939

ఎదులాపురం, ఆగస్టు 31 : రాష్ట్రంలో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడనుందని, వాయుగుండంగా మారే అవకాశం ఉందని, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న రెండు రోజులు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించిందని, ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టులను పరిశీలిస్తూ ఉండాలని, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు, రహదారులు, వంతెనలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మున్సిపల్ సిబ్బంది పాత భవనాలు, ఇండ్లు, గోడలు వర్షానికి కూలిపోయే దశలో ఉన్న వారిని గుర్తించి ముందు జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా అధికారులతో మాట్లాడుతూ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని అన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 18004251939, ఆర్‌అండ్‌బీ కంట్రోల్ రూమ్ నంబర్ 8106128195, ఇరిగేషన్ కంట్రోల్ రూమ్ నంబర్ 91873226050 అత్యవసర పరిస్థితుల్లో ఈ నంబర్లకు కాల్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజులు భారీ వర్షాలు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 31 : రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో భారీ వర్షాలు కురి సే అవకాశం ఉండడంతో జిల్లాలోని ప్రాజెక్టులు నదీ పరీవాహక ప్రాంత ప్రజలు, రై తులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువులు, వాగుల పరిసరాల్లోకి పశువుల ను తీసుకెళ్లరాదని, లోతట్టు ప్రాంతాల ప్ర జలను అప్రమత్తం చేస్తూ అధికారులు స హాయక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో హ్యాకథాన్

బాసర, ఆగస్టు 31 : బాసర ఆర్జీయూకేటీలో శనివారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. వీసీ వెంకటరమణ ఆదేశాల మేరకు అసోసియేట్ డీన్స్ డాక్టర్ చంద్రశేఖర్, మహేశ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు సృజన, రంజిత్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

అమ్మవారిని దర్శించుకున్న మహారాష్ట్ర న్యాయమూర్తి

బాసర సరస్వతీ అమ్మవారిని శనివారం మహారాష్ట్రలోని ముంబై ఉన్నత న్యాయస్థానం ఔరంగాబాద్ బ్రాంచ్ న్యాయమూర్తి శ్రీ నితిన్ బి సూర్యవంశీ, శ్రీ శైలేష్ పి.బ్రహ్మేలు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఇచ్చోడ, ఆగస్టు 31 : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రోజారాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల(బాలికల)లో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పాఠశాల, కళాశాల బోధనేతర సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణవేణి, ఆశ్విని, లలిత, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీపీఆర్‌వోపై కలెక్టర్ ఫిర్యాదు

ఎదులాపురం, ఆగస్టు 31 : తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ శుక్రవారం ఆదిలాబాద్ కేంద్రానికి వస్తున్నారని, కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మీడియా సమావేశానికి ఏర్పాట్లు చేయాలని, ముందుగా సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆయనను అరగంట పాటు ఆరుబయటే నిలబడేలా చేసిన ఆదిలాబాద్ డీపీఆర్‌వో తిరుమలపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక రాష్ట్ర చైర్మన్ క్యాబినెట్ హోదా కలిగినటువంటి వ్యక్తిని ఆ విధంగా అవమానపర్చడం సరైంది కాదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత ఆదిలాబాద్ డీపీఆర్‌వోపై సమాచార శాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రకాశ్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

గారవ డాక్టరేట్ పురస్కార గ్రహీత
మా కుమారునికి ప్రత్యేక అభినందనలు...
డా॥ శ్రీ కోడిగంటి సచిత్ కుమార్ గారు
ఆప్తామెట్రిస్ట్, ఆదిత్య ఐ కేర్ సెంటర్
R/o. రాజురా, మం॥ ఖానాపూర్
శ్రీ & శ్రీమతి కోడిగంటి నారాయణ హేమలత
అమ్మ నాన్న
* ఓ మారుమూల గ్రామం నుండి డాక్టరేట్ వరకు
* ఓ సాధారణ దర్జి కుటుంబం నుండి డాక్టరేట్ పురస్కారం
* ఆప్తామాలజిస్ట్ డిప్లొమా సంపాదించి ఆప్తామెట్రిస్ట్‌గా విశిష్ట సేవలు
* సేవ కోసమే ఆదిత్య ఐ కేర్ సెంటర్ స్థాపన
* సుమారు 2 వేల మంది ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు, ఆపరేషన్లు, పరీక